




VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 121 | శుక్రవారం 02 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-


## భవిష్యత్తు యుద్ధాలపై అమెరికా భారీ కసరత్తు..
# కీలక బాధ్యతల్లో ఎలాన్ మస్క్!

భవిష్యత్తులో యుద్ధాలు ఎలా ఉండబోతున్నాయి? వాటిని ఎదుర్కొనేందుకు ఎలాంటి అధునాతన సాంకేతికత అవసరం? సైనిక రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని ఎలా కొనసాగించాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికేందుకు అమెరికా రక్షణ శాఖ కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్, రక్షణ రంగ సంస్థ ఆండ్యూరిల్ వ్యవస్థాపకుడు పామర్ లక్కీ, అమెరికా మాజీ ప్రతినిధుల సభ స్పీకర్ న్యూట్ - మిగతా2లో



# విమానాన్ని కూల్చే కుట్ర పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

● భారత పైలట్‌పై కో-పైలట్ కత్తితో దాడి చేశాడని వెల్లడి ● టీవీ షో చూసి విమానాన్ని కాపాడిన ప్రయాణికుడు ● ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఈ కథ చెప్పారన్న ట్రంప్ ● అయితే ఇది నిజమో కాదో తనకు తెలియదని వ్యాఖ్య


2

## బీసీ రిజర్వేషన్లకు గొడ్డలి పార్టీయే అడ్డంకి..
# సుప్రీంకోర్టుకు వెళుతున్నాం

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా రేపల్లెలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తెలుగుదేశం పార్టీ 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, గత 'గొడ్డలి పార్టీ' ప్రభుత్వం దాన్ని 24 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. "దీనివల్ల దాదాపు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారు. మేము మళ్లీ 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తే, వాళ్లే కోర్టుకు వెళ్లి అడ్డుపడ్డారు. - మిగతా2లో



## ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల సంఘం తీరు పై 'ఓట్ చోరీ' భారీ నిరసన కార్యక్రమం




- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్. - ఎమ్మార్వోకు నిరసన డిమాండ్ పత్రాన్ని అందజేసిన ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు. 2

## ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

- స్మార్ట్ సిటీ నిధులతో ఆధునీకరించిన వసతి సౌకర్యాలను ప్రారంభం చేసిన కేంద్ర మంత్రి.

నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా 2వ డివిజన్ తీగలగుట్టపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్మార్ట్ సిటీలో రూ. 1.05 కోట్ల నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అధునీకరణ పనుల వసతి సౌకర్యాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. - మిగతా2లో



## అందరికీ తెలియజేయాల్సిన సంతోషకరమైన సమాచారం ఇది



● అదృశ్యమైన గొర్రెల కాపరి బాలుడు రామయ్య కథ సుఖాంతం ● సోషల్ మీడియాలో వైరల్ పోస్టులతో స్పందించిన మంత్రి లోకేశ్ ● రంగంలోకి దిగి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన నెల్లూరు కలెక్టర్ ● రామయ్య చదువు, తల్లిదండ్రులకు అండగా ఉంటామని లోకేశ్ హామీ ● కుటుంబానికి ఇల్లు, తండ్రికి వైద్యం, తల్లికి ఉపాధి కల్పిస్తామన్న మంత్రి

సోషల్ మీడియా వేదికగా జరిగిన ఓ మంచి ప్రయత్నం ఫలించింది. నెల్లూరు జిల్లాలో అదృశ్యమైన గొర్రెల కాపరి బాలుడు రామయ్య కథ సుఖాంతమైంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన పోస్టుల పై ఏపీ మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించారు. - మిగతా2లో

# తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి..


2

● హిమాయత్‌నగర్‌లో 20 వేల ఓట్లు తొలగించారని ఆరోపణ ● బీజేపీతో ఈసీ కుమ్మక్కైందంటూ దానం విమర్శలు ● తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ ● ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక

# ఖైరతాబాద్ టికెట్ అడిగే హక్కు నాకుంది..

అవకాశం ఇస్తే పోటీ చేస్తానంటున్న చింతల రామచంద్రారెడ్డి
టికెట్‌పై తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానిదేనని వ్యాఖ్య
దానం అనర్హతపై బీజేపీ న్యాయపోరాటం చేసిందని వ్యాఖ్య
ఉప ఎన్నికపై బీజేపీలో టికెట్ ఆశావహుల పోటీ


2

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A0153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

# బీసీ రిజర్వేషన్లకు గొడ్డలి పార్టీయే అడ్డంకి.. సుప్రీంకోర్టుకు వెళుతున్నాం

“దీనివల్ల దాదాపు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారు. మేము మళ్లీ 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తే, వాళ్లే కోర్టుకు వెళ్లి అడ్డుపడ్డారు. బీసీల పై ద్వేషంతోనే ఈ కుట్ర చేస్తున్నారు. అయినా మేం వెనకడుగు వేయం. సుప్రీంకోర్టుకు వెళుతున్నాం. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాడతాం” అని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. “అప్పులు దొరక్కపోతే రాష్ట్ర ఆస్తులను తాకట్టు పెట్టారు. కనీసం మద్యపాన నిషేధం హామీని నిలబెట్టుకోకుండా, భవిష్యత్తులో 25 ఏళ్లపాటు మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన దారుణమైన పరిస్థితిని సృష్టించారు. మేం అధికారంలోకి వచ్చాక ఆ అప్పుల వడ్డీ రేట్లను తగ్గించి, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం” అని వివరించారు. ముఖ్యమంత్రి అంటే సెక్రటేరియట్‌లో కూర్చోవడం కాదని, సామాన్యుడిలా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టాలు తీర్చడమే తన బాధ్యత అని స్పష్టం చేశారు.

**అమరావతి జోలికెళితే మసైపోతారు!**

రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నాశనం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. “సైబరాబాద్‌ను నిర్మించిన అనుభవంతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనుకుంటే, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ నాటకాలకు తెరలేపారు. అమరావతిని ఎడారి, శ్మశానం అంటూ సర్వనాశనం చేశారు. కానీ రైతుల త్యాగాలు, ముక్కోటి దేవతల ఆశీస్సులతో అమరావతి నిలబడింది. ఇకపై అమరావతిని ఒక్క ఇంచు కూడా ఎవరూ కదిలించలేరు. ఆ ప్రయత్నం చేస్తే మసి అయిపోతారు” అని తీవ్రంగా హెచ్చరించారు. అదేవిధంగా, పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను గోదావరిలో ముంచేశారని, తాము మళ్లీ దాన్ని బాగుచేసి వచ్చే ఏడాది మార్చి నాటికి ఫేజ్-1 పూర్తి చేసి కృష్ణా నదికి నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షంలో నిర్మాణాత్మక పోటీతత్వం ఉండాలి గానీ, గత ప్రభుత్వంలో కుట్రతత్వం మాత్రమే ఉందని చంద్రబాబు విమర్శించారు. “మేం పరిశ్రమలు తెస్తే, వాళ్లు పారిశ్రామికవేత్తలను తరిమి కొట్టారు. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. వ్యాన్‌పిక్ వంటి ప్రాజెక్టులను అవినీతితో నాశనం చేసి, ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకున్నారు. ఇప్పుడు సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నారు. మేం రోడ్లు వేస్తే వాళ్లు గుంతలు తవ్వారు. పట్టాదారు పాసుపుస్తకాలపై, సర్వే రాళ్లపై కూడా వాళ్ల బొమ్మలు వేసుకొని రూ. 800 కోట్లు దుర్వినియోగం చేశారు” అని ఆరోపించారు.

# ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.

విద్యార్థులకు పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన పనుల్లో భాగంగా నూతనంగా ఆధునీకరణ చేసిన డైనింగ్ హాల్, స్టేజ్ ను ప్రారంభించి...పాఠశాలల్లో చేపట్టిన కంపోండ్ వాల్, టైల్స్ ఫ్లోరింగ్, మరుగు దొడ్లు, గ్రానైట్ ఫ్లోరింగ్, బోర్ వేల్స్, ఇంపీరియల్ కోర్ట్, పేయింటింగ్, తరగతి గదుల ఆధునీకరణ, తదితర వసతి సౌకర్యాలను పరిశీలించారు.

**- సంకల్ప అభియాన్ - అంగన్వాడీ మిలన్ సేవా'లో సందడి చేసిన కేంద్ర మంత్రి.**

స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సంకల్ప అభియాన్'లో భాగంగా నిర్వహించిన 'అంగన్వాడీ మిలన్ సేవా' కార్యక్రమంలో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలువురు కార్పోరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన 'పోషకాహారంపై మాట ముచ్చట' ప్రదర్శనలో వివిధ రకాల పోషకాహార పదార్థాల స్టాళ్లను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం చిన్నారులకు స్వయంగా పోషకాహార పదార్థాలను పంపిణీ చేసి...చిన్నారులతో సందడి చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో బోధన, అభ్యాసన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సేవల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని, ఆశా వర్కర్లను తమ చేతుల మీదుగా శాలువాలతో సత్కరించారు. అనంతరం స్థానిక పాఠశాలల ఆవరణలో ఆసరా పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆసరా ప్రాణదాతల అవార్డుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలువురు కార్పోరేటర్లతో కలిసి జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఆసరా ఫౌండేషన్' (ప్రాణదాతల(దోనర్లకు) తమ చేతుల మీదుగా జిల్లా స్థాయి అవార్డులను ప్రధానం చేశారు. రక్తదానం ద్వారా ఇతరుల ప్రాణాలు కాపాడిన పలువురు రక్తదాతలను (ఆసరా ప్రాణదాతల) శాలువాలతో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. రక్తదానం చేస్తూ సమాజ సేవ చేస్తున్న ప్రాణదాతలను అభినందించి వారి సేవలను కొనియాడారు.

# అందరికీ తెలియజేయాల్సిన సంతోషకరమైన సమాచారం ఇది

సోషల్ మీడియా వేదికగా జరిగిన ఓ మంచి ప్రయత్నం ఫలించింది. నెల్లూరు జిల్లాలో అదృశ్యమైన గొర్రెల కాపరి బాలుడు రామయ్య కథ సుఖాంతమైంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన పోస్టులపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో రంగంలోకి దిగిన జిల్లా యంత్రాంగం, బాలుడిని క్షేమంగా గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చింది. ఈ విషయాన్ని మంత్రి లోకేశ్ స్వయంగా వెల్లడించారు. ఇది అందరికీ అత్యవసరంగా తెలియజేయాల్సిన సంతోషకరమైన సమాచారం అని పేర్కొన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గొర్రెల కాపరిగా ఉన్న రామయ్య అనే బాలుడు కనిపించడం లేదంటూ నిన్నటి నుంచి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఈ విషయం తన దృష్టికి రావడంతో తాను ఎంతో కలత చెందానని మంత్రి లోకేశ్ తెలిపారు. “మీ అందరి ప్రార్థనలు ఫలించాయి. బాలుడు రామయ్యను సురక్షితంగా ఇంటికి తీసుకొచ్చాం” అని ఆయన పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాంశు శుక్లా నేతృత్వంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, బాలుడి ఆచూకీని వేగంగా కనుగొన్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా రామయ్య కుటుంబానికి మంత్రి లోకేశ్ పలు హామీలు ఇచ్చారు. బాలుడిని రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించి, చదువు చెప్పిస్తామన్నారు. అనారోగ్యంతో ఉన్న రామయ్య తండ్రికి మెరుగైన వైద్యం, తల్లికి స్వయం ఉపాధి కల్పిస్తామని తెలిపారు. అంతేకాకుండా, ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సమాచారాన్ని తన దృష్టికి తెచ్చిన ప్రతి ఒక్కరికీ, బాలుడిని వెతికి పట్టుకోవడంలో వేగంగా స్పందించిన కలెక్టర్ హిమాంశు శుక్లాతో పాటు ఇతర అధికారులకు, సిబ్బందికి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు.

# విమానాన్ని కూల్చే కుట్ర పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ విమానంలో జరిగినట్లుగా చెబుతున్న అసాధారణ ఘటన గురించి సంచలన వివరాలు వెల్లడించారు. యూఎస్ నుంచి ఇజ్రాయెల్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేందుకు జరిగిన కుట్రను ఎలా భగ్నం చేశారో ఆయన వివరించారు. అయితే, ఈ కథ అంతా తనకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పారని, దీనిలో నిజానిజాలు తనకు పూర్తిగా తెలియవని చెప్పడం గమనార్హం. ఓవల్ ఆఫీస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వివరాలు పంచుకున్నారు. ఆయన కథనం ప్రకారం.. “ఆ విమానం కో-పైలట్ ఒక ఉగ్రవాది లేదా మానసిక స్థితి సరిలేని వ్యక్తి అయి ఉండొచ్చు. అతను విమానం నడుపుతున్న పైలట్‌పై కత్తితో దాడి చేశాడు. ఆ పైలట్ భారతీయుడైన స్మిత్ మచ్చర్. తీవ్రంగా గాయపడినా అతను ధైర్యంగా పోరాడాడు. కాక్‌పిట్ డోర్ తెరిచి, సహాయం కోసం గట్టిగా అరిచాడు. అతను నిజమైన హీరో” అని ట్రంప్ ప్రశంసించారు. ట్రంప్ చెప్పిన వివరాల ప్రకారం.. ఆ సమయంలో విమానంలో ప్రయాణిస్తున్న ఓ ఇజ్రాయెల్ ప్రయాణికుడు అద్భుతమైన రీతిలో జోక్యం చేసుకున్నాడు. వృత్తిరీత్యా ప్లంబర్ అయిన అతనికి విమానాలు నడపడంలో ఎలాంటి అనుభవం లేదు. కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లి, కో-పైలట్‌ను సీటులోంచి బయటకు లాగి వెనక్కి తోసేశాడు. ఆ తర్వాత ఇతర ప్రయాణికులు అతడిని బంధించారు. “విమాన ప్రమాదాలపై వచ్చే 'ఎయిర్ డిజాస్టర్స్' అనే టీవీ షోను తాను తరచుగా చూస్తానని, దాని ద్వారానే విమానం నడపడంలో కొన్ని ప్రాథమిక విషయాలు నేర్చుకున్నానని ఆ ప్లంబర్ తర్వాత చెప్పినట్లు నెతన్యాహు నాతో అన్నారు” అని ట్రంప్ వివరించారు. ఆ తర్వాత విమానం వెనుక భాగంలో ఉన్న అదనపు పైలట్లు, భద్రతా సిబ్బంది కాక్‌పిట్‌కు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారని, అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలో సురక్షితంగా ల్యాండ్ చేశారని ట్రంప్ తెలిపారు. “ఇది నేను విన్న అత్యంత అద్భుతమైన కథ” అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ కథనంపై చివర్లో ట్రంప్ స్వయంగా ఓ స్పష్టత ఇచ్చారు. “ఇది కేవలం నేను విన్న కథ మాత్రమే. ఇది నిజమో కాదో నాకు తెలియదు.

## ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల సంఘం తీరు పై 'ఓట్ చోరీ' భారీ నిరసన కార్యక్రమం

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ , ఏపీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి వైస్ షర్మిలా రెడ్డి AICC సభ్యులు, కర్నూల్ జిల్లా ఇంచార్జ్ జెంగిటి లక్ష్మీనరసింహ యాదవ్, నంద్యాల డీసీసీ అధ్యక్షులు గార్లపాటి మద్దిలేటి స్వామి ఆదేశాల మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ హయాంలో దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించారని (ఓట్ చోరీ) నిరసిస్తూ ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గౌడు సెంటర్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ మరియు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పై నిరసనగా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును కాలరాయడం తీవ్రమైన నేరం. దేశంలో కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించి ఓట్ చోరీకి పాల్పడటం రాజ్యాంగ విరుద్ధం. దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ దిగిపోయే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ నిరసన కార్యక్రమం లో తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, ఓటర్ల హక్కులను కాపాడటంలో విఫలమైన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి లేదా ఆయనను తొలగించాలి. బీజేపీ కు మద్దతుగా ఉంటూ ఓట్లు తొలగింపు చర్యలకు పాల్పడిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి. 13 కోట్ల ఓట్ల తొలగింపుపై విచారణ: దేశవ్యాప్తంగా అక్రమంగా తొలగించిన 13 కోట్ల ఓట్లకు సంబంధించి సమగ్రమైన, స్వతంత్ర సుప్రీంకోర్టు న్యాయ విచారణ జరిపించాలి. ఓటరు ఎస్ఐఆర్ ద్వారా తొలగించిన అర్హులైన ఓటర్లందరి పేర్లను వెంటనే తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలి. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల కమిషన్ స్వతంత్రతను దెబ్బతీసే చర్యలను తక్షణమే నిలిపివేయాలి.ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం మరియు పారదర్శకతను పునరుద్ధరించడానికి ఈవీఎం వినియోగాన్ని తక్షణమే నిషేధించాలి. ప్రపంచంలోని ప్రముఖ ప్రజాస్వామ్య దేశాల్లో లాగే భారతదేశంలో కూడా రాబోయే అన్ని ఎన్నికలను మళ్లీ పాత పద్ధతిలోనే బ్యాలెట్ పేపర్ ద్వారానే నిర్వహించాలి ఈసీ ఐటీ/పోర్టల్ నిర్వహణ మరియు ఓటర్ల తొలగింపు ప్రక్రియల విషయంలో మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా లేదా వారి అభ్యంతరాలను పక్కనపెట్టి ప్రధాన కమిషనర్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని సీడబ్ల్యూసీ సమావేశంలో కూడా కాంగ్రెస్ ముఖ్య నేతలు పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు సాంప్రదాయకంగా ఓటు బ్యాంక్ ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో, ప్రత్యేకించి పేదలు, మైనారిటీలు, మరియు వెనుకబడిన వర్గాల ఓట్లను ఎవరికీ ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఓటరు జాబితాల నుండి తొలగిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు షేక్.జాకీర్ హుస్సేన్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు ఎం.పి మద్దిలేటి,డీసీసీ జనరల్ సెక్రటరీ అహమద్ బాషా,ఆత్మకూరు మండల అధ్యక్షులు బి.ఆర్. కృష్ణా రెడ్డి, జనరల్ సెక్రటరీ రెహమాన్, పట్టణ అధ్యక్షులు కోవా ఖాదర్,వెలుగోడు మండల అధ్యక్షులు అక్బర్ సాహెబ్, జిల్లా కార్యదర్శి ఇబ్రహీం, కొత్తపల్లి మండల ఉపాధ్యక్షులు నాగన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అహమద్ హుస్సేన్,ఆత్మకూరు పట్టణ అధ్యక్షురాలు ఆశా జ్యోతి,కొత్తపల్లి మండల యూత్ అధ్యక్షులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి..

నగరంలో ఓట్ల తొలగింపు వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఈ అంశంపై మాజీ మంత్రి దానం నాగేందర్ ఎన్నికల సంఘం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ తన వైఖరి మార్చుకోకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ మొత్తం తగలబడిపోతుందని వ్యాఖ్యానించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో సీసీ రోడ్ల పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు బీజేపీతో కుమ్మక్కై పనిచేస్తున్నారని దానం నాగేందర్ ఆరోపించారు. హిమాయత్ నగర్ డివిజన్‌లోనే సుమారు 20 వేల ఓట్లను ఏకపక్షంగా తొలగించారని పేర్కొన్నారు. ఢిల్లీ కేంద్రంగా బీజేపీ నాయకులు వ్యవస్థీకృతంగా 'ఓట్ చోరీ'కి పాల్పడుతున్నారని విమర్శించారు. స్థానికంగా ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. తన నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడే బాధ్యత తనపై ఉందని దానం నాగేందర్ తెలిపారు. తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈసీ స్పందించకపోతే నిరసనలు, ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# భవిష్యత్తు యుద్ధాలపై అమెరికా భారీ కసరత్తు.. కీలక బాధ్యతల్లో ఎలాన్ మస్క్!

అమెరికా రక్షణ శాఖ ప్రారంభించిన 'ప్రాజెక్ట్ మెరిడియన్'కు ఈ ముగ్గురు సంయుక్తంగా నాయకత్వం వహించనున్నారు.రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. భవిష్యత్తు యుద్ధాల్లో అమెరికాకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన ఆయుధ వ్యవస్థలు, సైనిక సామర్థ్యాలను ఈ బృందం అధ్యయనం చేయనుంది. ప్రాజెక్టు ప్రారంభమైన 120రోజుల్లోగా నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఇందు లోని ప్రధాన వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. రహస్య సమాచారంతో ప్రత్యేక అనుబంధాన్ని కూడా రూపొందించనున్నారు.

**భూమి నుంచి అంతరిక్షం వరకు..**

భవిష్యత్తు యుద్ధాల్లో భూగర్భ ప్రాంతాల నుంచి భూమి, చంద్రుడి మధ్య ఉన్న అంతరిక్ష ప్రాంతం వరకు ఎదురయ్యే సవాళ్లను ఈ అధ్యయనం పరిశీలించనుంది. ఇందుకు అవసరమైన సాంకేతికతను గుర్తించి, వాటిని సైనిక అవసరాలకు అనుగుణంగా త్వరగా అందుబాటులోకి తీసుకు రావడం పై దృష్టి పెట్టనుంది. ఈ ప్రాజెక్టుకు అమెరికా రక్షణ శాఖ సాంకేతిక విభాగం అధిపతి ఎమిల్ మైఖేల్ సమన్వయకర్తగా వ్యవహరించ నున్నారు. విద్యా, విధాన రూపకల్పన, పరిశ్రమలకు చెందిన నిపుణులు కూడా ఇందులో భాగం కానున్నారు.

**మరో ఐదు కీలక ప్రాజెక్టులు**

ప్రాజెక్ట్ మెరిడియన్‌తో పాటు మరో ఐదు కార్యక్రమాలను హెగ్‌సెత్ ప్రకటించారు. స్వయంప్రతిపత్తితో పనిచేసే యుద్ధ వ్యవస్థల అభివృద్ధి కోసం 2027 అక్టోబరు 1 నాటికి ప్రత్యేక కమాండ్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సైనిక స్థావరాల భద్రత, దేశీయంగా కీలక విడిభాగాల తయారీని పెంచేందుకు 'ఫోర్జెస్ అమెరికా' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అత్యాధునిక రక్షణ వ్యవస్థలు, స్వయం సమృద్ధితో పనిచేసే విద్యుత్ సదుపాయాలతో కొత్త సైనిక స్థావరాన్ని నిర్మించనున్నారు. ఐదు విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక సైనిక శిక్షణ కార్యక్రమాలు, సైనికులకు మతపరమైన సహకారం అందించేందుకు ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు కూడా ఈ ప్రణాళికల్లో ఉన్నాయి.

**ఎవరికి ఏ రంగంలో అనుభవం?**

ఎలాన్ మస్క్ 2002లో స్పేస్‌ఎక్స్‌ను స్థాపించారు. రాకెట్లు, అంతరిక్ష నౌకల తయారీ, ప్రయోగాల్లో ఆ సంస్థ కీలకంగా పనిచేస్తోంది. పామర్ లక్కీ అమెరికా రక్షణ సాంకేతిక సంస్థ ఆండ్యూరిల్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు. న్యూట్ గింగ్రిచ్ 1995 నుంచి 1999 వరకు అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా పనిచేశారు. వీరి అనుభవాన్ని భవిష్యత్తు యుద్ధాలకు అవసరమైన సాంకేతిక, వ్యూహాత్మక ప్రణాళికల రూపకల్పనలో వినియోగించుకోవాలని అమెరికా రక్షణ శాఖ భావిస్తోంది.

# ఖైరతాబాద్ టికెట్ అడిగే హక్కు నాకుంది..

ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్ టికెట్ అడిగే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టాలన్నది నిర్ణయిస్తుందని, తాను మాత్రం టికెట్ ఆశిస్తున్నానని చెప్పారు. దానం నాగేందర్ పార్టీ మారి కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలోనే ఆయన ఎమ్మెల్యే పదవి రద్దు కావాల్సిందని చింతల అన్నారు. దానం అనర్హత కోసం బీజేపీ న్యాయపోరాటం చేసిందని తెలిపారు. హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు లోనూ పోరాడామని చెప్పారు. తమ ప్రయత్నాల ఫలితంగానే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడిందని పేర్కొన్నారు. దానం నాగేందర్ ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై 2023లో ఎమ్మెల్యేగా గెలిచిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు ఆయనను అనర్హుడిగా ప్రకటించింది.సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకు నేందుకు నిరాకరించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. ఇదే సమయంలో ఖైరతాబాద్ ఉప ఎన్నికపై బీజేపీలో టికెట్ ఆశిస్తున్న నేతల సంఖ్య పెరుగుతోంది. చింతల రామచంద్రారెడ్డి గతంలో ఖైరతాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు టికెట్ రేసుపై ఆసక్తిని పెంచాయి. అయితే అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం పార్టీ నాయకత్వమే తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఎనిమిది లోక్‌సభ స్థానాలు గెలిచిందని చింతల గుర్తుచేశారు. గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధించిందన్నారు. ఖైరతాబాద్‌లోనూ బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాను ఇప్పటివరకు ఖైరతాబాద్‌ను వదిలి ఎక్కడికీ వెళ్లలేదని, పార్టీ అవకాశం ఇస్తే బరిలోకి దిగుతానని చెప్పారు.

# సంపాదకీయం

## ప్రశ్నించే ధైర్యమే కవిరాజు



కవిరాజు త్రిపురనేని రామస్వామి తెనాలి మునిసిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భమిది. ఒక శతాబ్దం తర్వాత కూడా ఆయనను ఎందుకు గుర్తుచేసుకోవాలి? ఆయన ఆలోచనలు నేటి తరానికి ఏమి చెబుతాయి? అంటే... ఈ కాలానికి కూడా 'ఎందుకు?' అన్న ప్రశ్నను ఆయన వదిలి వెళ్లారు. మన కాలంలో సమాధానాల కొరత లేదు. ప్రశ్నల కొరత ఉంది. ఒక క్లిక్‌తో సమాచారం వచ్చేస్తుంది. ఒక అభిప్రాయం క్షణాల్లో వేల మందికి చేరుతుంది. ఒక సంఘటనకు పది వివరణలు ఎదురవుతాయి. వాటిలో ఏది సత్యం? ఏది అసత్యం? ఏది ప్రచారం? అనే ప్రశ్నలు మాత్రం మనమే వేసుకోవాలి. సమాచారం పెరిగిన కొద్దీ వివేచన కూడా పెరగాలి. ఈ సందర్భంలో కవిరాజు ఆలోచన మనకు ఇప్పటికీ ఉపయుక్తంగా ఉంటుంది. కవిరాజును కేవలం హేతువాది, నాస్తికుడు, సంఘసంస్కర్త అనే ముద్రలతో గుర్తుచేసుకోవడం అంటే... ఆయనను గతంలోనే వదిలేయడం. అవి ఆయన ఆలోచనలోని కొన్ని పార్శ్వాలను గురించి మాత్రమే చెబుతాయి. ఆయన అసలు ప్రాధాన్యత ప్రశ్నించే ధైర్యంలో ఉంది. సంప్రదాయం ఏదైనా, పురాణం ఏదైనా, అధికారం ఎవరిదైనా ఆయన మౌలికంగా అడిగిన ప్రశ్న... ఇది ఇలాగే ఎందుకు ఉండాలి? 'శూద్రుల మీద రవ్వంతైనా కనికరం లేకుండా నీ స్మృతిలో శూద్రుడు దాస్యమే చేయాలని ఎలా రాయగలిగావు?' అని ఆయన మనుస్మృతిపై చేసిన విమర్శలో అన్నారు. ఇది ఒక పురాతన గ్రంథంపై అభ్యంతరం మాత్రమే కాదు. ఒక నియమం పాతది కాబట్టి అది న్యాయమైనదేనా? ఎవరో రాశారు కాబట్టి దాన్ని ప్రశ్నించకూడదా? పుట్టుక ఆధారంగా ఒక మనిషికి మరొక మనిషిపై అధికారం ఎలా వస్తుంది? అనే మౌలిక ప్రశ్న. శంబుక వధలోనూ ఇదే ప్రశ్నించే ధోరణి కనిపిస్తుంది. ఆ రచనను కేవలం రాముడిపై విమర్శగా చదవడం దాని విస్తృత ఉద్దేశాన్ని కుదించడం. రామాయణంలోని ఒక ఘట్టం ఆధారంగా వర్ణధర్మంలో దాగి ఉన్న అన్యాయాన్ని కవిరాజు ప్రశ్నించారు. జ్ఞానం, తపస్సు, ఆలోచనకు పుట్టుక ఆధారంగా హద్దులు ఎందుకు ఉండాలనే ప్రశ్నను ముందుకు తెచ్చారు. కవిరాజు ప్రశ్నించినది మత విశ్వాసాన్ని మాత్రమే కాదు, మనిషి కళ్ల ముందు ఉన్న బాధను వదిలి, కనిపించని శక్తుల కోసం ఎందుకు ఆరాటపడాలి? అనే ప్రశ్న కూడా ఆయన రచనల్లో కనిపిస్తుంది. "మలమల మాడు పొట్ట, తెగ మాసిన బట్ట"తో ఆకలితో అలమటిస్తున్న నిరుపేదను చూసి జాలి చూపకుండా, "జీవరహితంబగు బొమ్మకు" ఇళ్లు, వాకిళ్లు, పొలాలు సమర్పించే భక్తిని ఆయన ప్రశ్నించారు. ఇక్కడ హేతువాదం మానవత్వంతో కలుస్తుంది. ఆకలితో ఉన్న మనిషి కళ్లముందు ఉన్నప్పుడు, కనిపించని శక్తిపై భక్తి కంటే... మనిషి పట్ల బాధ్యతను గుర్తుచేసే దృష్టి ఇది. కవిరాజు ప్రశ్నలు పుస్తకాలకే పరిమితం కాలేదు. తెనాలి మునిసిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు నిర్హేతుకమైన సంప్రదాయాలు, మూఢనమ్మకాలతో కూడిన ఆచారాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నారు. జంతు బలులు వంటి ఆచారాలను తొలగించేందుకు ప్రయత్నించారు. అంటే రచనలో ప్రశ్నించిన విషయాన్నే ప్రజా జీవితంలోనూ ప్రశ్నించారు. రెండింటి వెనుకా ఒకటే స్వభావం ఉంది... కారణం లేని ఆచారాన్ని అంగీకరించకపోవడం. ఇదే కవిరాజు ప్రత్యేకత. ఆయనకు "ఇది ఎందుకు?" అనేది సాహిత్య ప్రశ్న మాత్రమే కాదు. పరిపాలనా ప్రశ్న కూడా. ఆయన తన రచనలకు రాసిన విస్తృత పీఠికలు, బెర్నార్డ్ షా పీఠికలను ఆంగ్లంలో ౡఋజఖుఅ జూతీవఖుఎవం అని పిలిచినట్టుగా, కేవలం ముందుమాటలు కావు. రచన ఎందుకు చేశారు, ఏ సందర్భంలో రాశారు, దాని వెనుక ఉన్న ప్రశ్న ఏమిటి అనే విషయాలను పాఠకుడితో ముందుగానే పంచుకున్నారు. అంటే రచనకు ముందు పాఠకుడితో ఒక సంభాషణ మొదలుపెట్టారు. ఇదే కవిరాజును నేటి యువతకు దగ్గర చేస్తుంది. జెన్ జీకీ, జెన్ ఆల్ఫాకూ ఆయనను పరిచయం చేయాల్సిన అవసరం ఆయన పాత సమాధానాలు చెప్పినందుకు కాదు, కొత్త ప్రశ్నలు వేయడం నేర్పినందుకు! ఏ సమాచారం వచ్చినా వెంటనే నమ్మకపోవడం, ఏ సంప్రదాయం ఎదురైనా దాని కారణాన్ని పరిశీలించడం, ఏ అధికారాన్నైనా ప్రశ్నించే స్వేచ్ఛను నిలబెట్టుకోవడం ఆయన ఆలోచనలోని ముఖ్యమైన పాఠం. సమాచారం ఎక్కువగా ఉన్న కాలంలో... ఒక వీడియో ఒక విషయాన్ని నిజమంటుంది. మరో వీడియో అదే విషయాన్ని అబద్ధమంటుంది. ఇలాంటి సమయంలో ఎవరి మాట నమ్మాలి అన్న దానికంటే, ఎందుకు నమ్మాలి అన్న ప్రశ్న ముఖ్యమవుతుంది. కవిరాజును అనుసరించాల్సిన అవసరం లేదు. ఆయన ప్రతి అభిప్రాయంతో ఏకీభవించాల్సిన అవసరమూ లేదు. ఆయనను నిజంగా చదవడం అంటే, ఆయనతో కూడా వాదించగల స్వేచ్ఛను సంపాదించుకోవడం. ఆయన చెప్పినదాన్ని కూడా ప్రశ్నించగలగడం. అదే ఆయన ఆలోచనా వారసత్వానికి నిజమైన గౌరవం. ఒక కొత్త తరం ఆయనను చదవాల్సిన కారణం కూడా ఇదే.

# శ్రీవారిని కాలినడకన వెళ్లి దర్శనం చేసుకున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు.



కాలినడకన తిరుమలకు వెళుతున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు



తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు

నంద్యాల అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆమె భర్త డాక్టర్ శివచరణ్ రెడ్డి లు గురువారం తెల్లవారుజామున శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు తిరుపతి చేరుకొని అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమల చేరుకొని గురువారం తెల్లవారుజామున శ్రీవారికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భర్త డాక్టర్ శివచరణ్ రెడ్డి తలనీలాలు సమర్పించుకొని శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శనం చేసుకొని, శ్రీవారి ఆశీస్సులు పొందడం ఆనందంగా ఉందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

# విద్యా కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి అభినందనలు

- విద్యార్థి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తా
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి విద్యాబోధన నేర్పిస్తా
- పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా బాటలు వేస్తా
- విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పెంచే విధంగా కృషి
- విద్యా కమిటీ చైర్మన్ శీలం నాగరాజు





ఆత్మకూరు అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో విద్యా కమిటీ చైర్మన్ గా శీలం నాగరాజుకు అవకాశం కల్పించడంతో గురువారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆత్మకూరు పట్టణంలోని శ్రీరామ నగర్ ప్రభుత్వ పాఠశాలకు విద్యా కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయం అని కొనియాడారు పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేసి ఉపాధ్యాయుల తో విద్యార్థులకు మంచి విద్యాబోధన ప్రభుత్వ అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం అందించే విధంగా కృషి చేస్తారని చెప్పారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి విద్యా బోధన అందించి పేదరికంలో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు కోసం పాటుపడే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని విద్యా కమిటీ చైర్మన్ శీలం నాగరాజు తెలిపారు నాపై నమ్మకం ఉంచి విద్యా కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించిన శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి మీడియా ద్వారా మరొకసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రబీలో మెట్ట పంటల సాగు పై కిసాన్ గోష్టి కార్యక్రమం

ఆత్మకూరు అక్టోబర్ 1 వార్త సాక్ష్యం



ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రబీ సీజన్లో తక్కువ నీటితో సాగుచేసే మెట్ట పంటలను ఎంచుకోవడం ద్వారా మంచి దిగుబడులను సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చెన్నయ్య రైతులకు వివరించారు. నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మోహన్ విష్ణువర్ధన్ వివిధ పంటలలో ఎల్ నినో పరిస్థితులలో పాటించవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై వివరించారు. అలాగే శాస్త్రవేత్త అరుణ్ కుమార్ మాట్లాడుతూ వర్షభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని రైతులు పంటల ఎంపిక చేసుకోవాలని, అలాగే సాగు విధానంలో తగిన మార్పులు చేసుకోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకొని పంట నష్టాలను నివారించుకోవచ్చని తెలిపారు. అలాగే తక్కువ నీటి లభ్యత ఉన్న ప్రాంతాలలో వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా మినుము, శనగ, జొన్న, వేరుసెనగ మరియు కుసుమ తదితర మెట్ట పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతోపాటు ఆశించిన దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సరైన సమయంలో విత్తనం, ఎరువుల వినియోగం, కలుపు నివారణ వంటి అంశాలలో శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. నేల స్వభావాన్ని బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని విత్తేముందు విత్తన శుద్ధి చేయించుకుని సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులను వినియోగించాలని తెలిపారు. వర్షపు నీటిని పొలాల్లో నిలువ చేసుకునేందుకు పంట అవశేషాలు, చిన్న నీటి కుంటలు, పొలాల చుట్టూ కాలువలు ఏర్పాటు చేసుకోవాలని అధికారుల సూచించారు. అలాగే పంటలను సంరక్షించేందుకు అంతర పంటలు, పంట అవశేషాలను నేలపై ఉంచడం, అవసరానికి అనుగుణంగా తక్కువ దున్నే పద్ధతులను అవలంభిశీచడం వలన పంటకు మేలు జరుగుతుందని, రైతులు నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేసి, బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. తొలి దశలోనే చీడపీడలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పొలంలో నీరు నిలవకుండా చూడడం, బాధిత మొక్కలను తొలగించడం, సిఫారసు చేసిన మందులను మాత్రమే వినియోగించడం ద్వారా తెగులు నియంత్రించవచ్చని తెలిపారు. రసాయన మందులు విచక్షణ రహితంగా వినియోగించకుండా అధికారుల సలహాల మేరకు సరైన మోతాదులో పిచికారి చేయాలని తెలిపారు. ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కే హేమలత మాట్లాడుతూ రైతులకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కింద రాయితీపై మినుము, కంది, కొర్ర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలియపరిచారు. విత్తనాలు నాలుగు కేజీల ప్యాకెట్ 103.50 రూపాయలకు, శనగ విత్తనాలు 35% రాయితీపై ఒక కేజీ విత్తనం 58.50 రూపాయలకు అందుబాటులో ఉన్నాయని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. వెలుగోడు మండల వ్యవసాయ అధికారి స్వాతి మాట్లాడుతూ ఈ సీజన్లో ఇప్పటివరకు ఏ పంట వేయని వారు తక్కువ నీటిని ఉపయోగించుకునే పంటలు మరియు తక్కువ కాల వ్యవధి ఉన్న పంటలు ఎంచుకోవాలని తెలిపారు. నీటి వసతి ఉండి బెట్టకు గురైన పరిస్థితుల్లో ఆరు సాళ్లకు ఒక లోతు సాలు నీరు ఇంకడానికి ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. లేదా ఒకసాలు విడిచి ఒకసాలు సాగు చేస్తే కొంతమేరకు పంటలను కాపాడుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ,ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు కొత్తపల్లి మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# నవ వధువులకు పెళ్లి కానుక పంపిణీ - బిసి రాజారెడ్డి

బనగానపల్లె, అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన నవ వధువుల కోసం ఉచితంగా పెళ్లి కానుక పంపిణీ చేస్తున్నట్లు పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాహితి సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి తెలిపారు. గురువారం పట్టణం లోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన ముల్లా కీ.శే. షేక్ మస్తాన్ షా , మాబ్బి దంపతుల కుమార్తె, ముల్లా బాబా ఫక్రుద్దీన్ ఫక్రుబి దంపతుల కుమార్తెల వివాహం సందర్భంగా వారికి పెళ్లి కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు కీ.శే.బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం నియోజక వర్గంలోని ఆయా గ్రామాల్లో వివాహం చేసుకోబోయే నూతన వధువులకు ఉచితంగా పెళ్లి కానుక అందజేస్తున్నట్లు తెలిపారు. 2022 నుంచి ఈ పెళ్లి కానుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రతి ఏటా వందల మంది నవ వధువులకు పెళ్లి కానుకలు అందజేస్తున్నట్లు తెలిపారు. పెళ్లి కానుకలో రూ.4 వేలు విలువ చేసే ప్రముఖ రేమాండ్, అరవింద్ కంపెనీలకు చెందిన పెళ్లి కుమారుడి సర్ట్, పాయింటు, పెళ్లి కుమార్తెకు ధర్మవరం చీరె అందజేస్తున్నట్లు తెలిపారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఈ పెళ్లి కానుక అందజేస్తున్నట్లు తెలిపారు. వధువు తరఫున పెళ్లి కార్డు తీసుకొని వచ్చి తనను సంప్రదిస్తే వారికి పెళ్ళికానుకను అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని బనగాన పల్లె, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల , అవుకు మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## బడుగు, బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలకు అడ్డంపడుతున్న వైసీపీ-మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

బడుగు బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలకు వైసీపీ పార్టీ అడ్డం పడుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి విమర్శించారు. గురువారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి బిసి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే అన్ని విధాలుగా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ వస్తోందని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీల సమగ్ర అభ్యున్నతికి,రాజకీయ ఎదుగుదలకు పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలను అడ్డుకుంటున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బీసీ ద్రోహి అని విమర్శించారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను కేవలం 24 శాతానికే పరిమితం చేసి, వారిని రాజకీయ నాయకత్వానికి శాశ్వతంగా దూరం చేయాలని వైసీపీ పన్నాగం పన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలహీన వర్గాల ప్రజలు ప్రతిపక్ష వైసీపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో బీసీల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచేందుకు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి గుర్తుచేశారు.బీసీల ఎదుగుదలను సహించలేని గొడ్డలి పార్టీ నేతలు కోర్టులకు వెళ్లి అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం పోరాడుతుందని మంత్రి బీసీ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో బలహీన వర్గాలకు దక్కాల్సిన న్యాయమైన వాటా సాధన కోసం సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.



# దత్తాత్రేయ స్వామివారికి విశేషపూజలు

శ్రీశైల దేవస్థానం అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

శ్రీశైలంలో లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతా భిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధ రణకోసమై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయుల వారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయ స్వామి వారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైల క్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమా విశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురు చరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువ కావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూప ములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయిం చారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చోని, కృష్ణానది లో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.



## సీజ్ చేసిన పాఠశాలలను వెనుక మార్గం ద్వారా ఆరోపణల పై అధికారులు తక్షణం విచారణ చేపట్టాలి

- ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి

కర్నూలు అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

ఎమ్మిగనూరు పరిధిలోని మెడా ప్రాక్సిస్ పాఠశాల మరియు చిన్నాపురంలోని ప్రతిభ విద్యానికేతన్ యూపీ స్కూల్‌ను ఎమ్మిగనూరు ఎంఈఓ-1 ఆంజనేయులు గతంలో సీజ్ చేసినప్పటికీ, సీజ్ చేసిన అనంతరం కూడా పాఠశాల యాజమాన్యాలు వెనుక మార్గం ద్వారా విద్యార్థులను లోపలికి తీసుకెళ్లి యథావిధిగా పాఠశాలలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి ఈ విషయంపై ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులకు పలుమార్లు ఆధారాలతో, ఫోటోలు మరియు ఇతర వివరాలతో ఫిర్యాదులు అందజేసినప్పటికీ ఇప్పటివరకు సరైన పరిష్కారం లభించలేదని ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి తెలిపారు సీజ్ చేసిన పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయా లేదా అనే విషయాన్ని విద్యాశాఖ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని ఆర్ఎస్ఎఫ్ డిమాండ్ చేస్తోంది అధికారులు తక్షణమే ఈ రెండు పాఠశాలలను ఆకస్మికంగా విజిట్ చేసి, పాఠశాల నిర్వహణపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, అనుమతులు, గుర్తింపు, విద్యార్థుల ప్రవేశాలు మరియు సీజ్ ఆదేశాల అమలుపై పరిశీలన చేయాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు విచారణలో తేలితే సంబంధిత పాఠశాల యాజమాన్యాలపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము విద్యార్థుల భద్రత, విద్యా హక్కులు మరియు ప్రభుత్వ నిబంధనలను పరిరక్షించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందని ఆర్ఎస్ఎఫ్ పేర్కొంది ఇప్పటికే అందజేసిన ఆధారాలను పరిగణనలోకి తీసుకుని తక్షణమే క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి, నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నాము ఈ సమస్యపై అధికారులు వెంటనే స్పందించకపోతే, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తదుపరి ప్రజాస్వామ్య పద్ధతిలో కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధవ్, కిషోర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.




## రామాపురంలో మురికి వరద...

- స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అంటే ఇదేనా...



అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమంలో ప్రతి నెలలో మూడవ శనివారం గ్రామస్థాయి మొదలుకొని మండల స్థాయి అధికారుల వరకు గ్రామాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహనపరచి స్వచ్ఛమైన వాతా వరణం ఉండేలా చూడాలి. అయితే బండి ఆత్మకూరు మండలంలో మాత్రం అధికారులు అవేమీ మాకు పట్టవం అంటూ పారిశుద్ధ్య పనులను గాలికి వదిలేశారు. గ్రామాల్లో డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మురికి నీరు మొత్తం రోడ్డుపై ప్రవహించడం, అర్ధదారిపై నడిచే వాహనదారులు పాదచారులు ముక్కులు మూసుకొని చేసేదేమీ లేక ఆ మురికి నీరులోనే వెళ్ళవలసిన దుస్థితి ఏర్పడిందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మురికి నీరు ఎక్కువగా రోడ్డుపై నిలువ ఉండడంతో దోమల నివాసాలుగా మారి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రామాపురం తో పాటు మరికొన్ని గ్రామాల్లో ఇలా మురికి నీరు రోడ్డుపై ప్రవహించడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పట్టినట్లుగా ఉంది. అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు మండి పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశుద్ధ పనులపై దృష్టి సారించాలని గ్రామాల పరిశుభ్రతను కాపాడాలని రోగాల బారిన పడకుండా ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన జోగి మేఘన

- పోలీసు రక్షణ కల్పించాలని రాయపాటి శైలజను కోరిన జోగి రమేష్ కోడలు



విజయవాడ అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ మాజీ మంత్రి జోగి రమేష్ కోడలు జోగి మేఘన ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాల యంలో చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజను మేఘన, ఆమె తండ్రి కృష్ణ, కుటుంబ సభ్యులు కలిసి తమ సమస్యలను వివరించారు.మేఘన తనకు, తన కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కోరారు. జోగి రమేష్‌కు చెందిన వ్యక్తులు తమను అనుసరిస్తున్నారని, దీంతో భయాందోళనకు గురవుతున్నామని ఆమె ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అలాగే ఇప్పటికే నమోదైన కేసు దర్యాప్తు సక్రమంగా జరగడం లేదని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. మేఘన తరపు న్యాయవాదితో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడి కేసుకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. మేఘన కుటుంబానికి అవసరమైన సహకారం అందిస్తామని, అవసరమైతే తెలంగాణ మహిళా కమిషన్‌తో మాట్లాడి పోలీసు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని శైలజ హామీ ఇచ్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఇప్పటికే ఈ కుటుంబ వివాదానికి సంబంధించి మేఘన పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం కూడా వార్తల్లో ఉంది. ఈ కేసులోని ఆరోపణలు, వాటిపై దర్యాప్తు అంశాలు ప్రస్తుతం చట్టపరమైన ప్రక్రియలో ఉన్నందున వాటిని తుది నిర్ధారణలుగా పరిగణించాల్సిన అవసరం ఉంది.

## కురుకుంద గ్రామ పంచాయతీ పరిధిలో తడి చెత్త పొడి చెత్త పై ప్రజలకు అవగాహన

ఆత్మకూరు అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

గురువారం మండల పరిధిలోని కురుకుంద గ్రామంలో ఎంపీడీఓ నాగేంద్రుడు ఆదేశాలతో గురు వారం, డిప్యూటీ ఎంపీడీఓ, పంచాయతీ డెవలప్మెంట్ అధికారి, పీడీఓ బాలునాయక్ తడి చెత్త పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించారు,ఈ సందర్భంగా షెడ్ నిర్వహణ, లో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ ప్రస్తుత కార్యకలాపాలకు సంబంధించిన పూర్తి వివరాలను పీడీఓని అడిగి తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా షెడ్‌ను సక్రమంగా, పరిశుభ్రంగా, సమర్థ వంతంగా నిర్వహించేందుకు తీసు కోవాల్సిన చర్యల పై ఎంపీడీవో అవసరమైన సూచనలు మార్గదర్శకాలు అందజేయడం జరిగిందని తెలియజేశారు.



VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


## ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాతలకు ఘన సన్మానం

**- అవార్డులను ప్రధానం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్.**






అక్టోబర్ 1 వార్త సాక్ష్యం : జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రోజున కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 30 మంది రక్తదాతలను ఘనంగా సన్మానించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అత్యవసర పరిస్థితులలో నిస్వార్థంగా ఎక్కువసార్లు రక్తదానం చేసిన దాతలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా 'ఆసరా ప్రాణదాత - 2026' జిల్లాస్థాయి అవార్డులను ప్రధానం చేసి సత్కరించారు. రక్తదాతలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించడంతో పాటు, సమాజంలో ఆసరా ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి గొల్లె తిరుపతి, సభ్యులు ఎం.రవిచందర్, ఎస్.నిఖిల్, పి.సంతోష్, ఎస్.అద్వైత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగమోత్కూర్,పాఠశాలలో షీ టీం అవగాహన సదస్సు

**-సొంత పాఠశాలలోనే విద్యార్థులకు అవగాహన కల్పించిన హెడ్ కానిస్టేబుల్ మౌజీస్ హుస్సేన్**




అక్టోబర్ 1 వార్త సాక్ష్యం: నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలు, షీ టీం సీఐ శైలజ సూచనల మేరకు మిర్యాలగూడ షీ టీం ఆధ్వర్యంలో మాడ్గుల పల్లిమండలం ఆగమోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడ షీ టీం హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ మౌజీస్ హుస్సేన్, కానిస్టేబుల్ లు రాజేశ్వరి, మధు ఆధ్వర్యం లో జరిగినఈకార్యక్రమంలో విద్యార్థులకు కీలకఅంశాలు మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు,ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ పై చట్టపరమైన చర్యలు ,సైబర్ క్రైమ్ మోసాలు, ఆన్ లైన్ లో అప్రమత్తత,విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన,బాల్య వివాహా ల నిర్మూలన,ద్విచక్ర వాహనంపై హెల్మెట్, ఫోర్ వీలర్ లో సీట్ బెల్ట్ ఆవశ్యకత,డయల్ 100, షీ టీం వాట్సాప్ నంబర్ ద్వారా ఫిర్యాదు చేసే విధానం, పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ మౌజీస్ హుస్సేన్ మాట్లాడుతూ తాను మండలంలోని చిరుమర్తి గ్రామంలో పుట్టి పెరిగి, ఆగామోత్కూరు ప్రభుత్వ పాఠశాలలోనే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నానని, నేడు పోలీస్ శాఖలో ఉద్యోగం చేస్తూ తాను చదువుకున్న పాఠశాలలోనే విద్యార్థులకు అవగాహన కల్పించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యంతో చదవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రధానోపాధ్యాయులు యెలేటి వినోద్ కుమార్, ఉపాధ్యాయులు జనార్ధన్, నరేందర్ రెడ్డి, ఆనంద్ కుమార్, అనంత రెడ్డి, బ్లాండినా ,రామజ్యోతి, సీఆర్పీ, వెంకన్న , విద్యార్థినీ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీశైల దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు







శ్రీశైల దేవస్థానం అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధనలో) శ్వేత నాట్య అకాడమీ, మార్కాపురం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించ బడుతున్నది. ఈ కార్యక్రమములో గణపతిప్రార్థన, శివకృతి, శివతాండవం, శివాష్టకం, తదితర గీతాలకు, అష్టకాలకు భవిష్య, హర్షితప్రియ, గాయత్రి, దివ్యమహా లక్ష్మి, చరణ్యశ్రీ, అభిజ్ఞ, ఊహశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. అలాగే రెండవ కార్యక్రమములో భాగంగా చిగురు ట్రస్ట్, బెంగుళూరు, కర్ణాటక వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి.

# ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు నిరుపేదలకు ఆసరా

**- మున్సిపల్ కమిషనర్ బేబీ, సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్**



ఆత్మకూరు అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో ఆత్మకూర్ మున్సిపాలిటీలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబీ తో కలిసి పాల్గొన్న సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల వలన పేదలకు ప్రభుత్వం భరోసా ఇస్తుంది అన్నారు. అదేవిధంగా సింగిల్ విండో చైర్మన్ మాట్లాడుతూ ఆనాడు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఆనాటి ముఖ్యమంత్రి వర్యులు స్వర్గీయ ఎన్టీఆర్ "సామాజిక పింఛన్ పథకము"ను ప్రవేశపెడితే నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు దానిని అంచమంచెలుగా పెంచుకుంటూ వృద్ధులకు, వితంతువులకు మరియు దివ్యాంగులకు ఒక పెద్ద కొడుకుగా, కుటుంబ యజమానిగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, కూటమి ప్రభుత్వం రెండు కళ్ళ సిద్ధాంతం" అభివృద్ధి-సంక్షేమం"ను అవలంబిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిపిల్ మున్నా, యూనిట్ ఇంచార్జ్ అన్సర్ అలీ, నాయకులు చేపల మా భాష, సచివాలయ సిబ్బంది రవి ప్రకాష్, రఫీక్, రాఘవ, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల రామాపురం జిల్లా పరిషత్ విద్యా కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి అభినందనలు

**- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి విద్యాబోధన**
**- పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం చేస్తా**



ఆత్మకూరు అక్టోబర్ 1 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని వడ్ల రామపురం గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో విద్యా కమిటీ చైర్మన్ గా సుగులూరి వెంకటరమణ, వైస్ చైర్మన్ బి. శిరీష కు అవకాశం కల్పించడంతో గురువారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు అనంతరం విద్యా కమిటీ చైర్మన్ సుగులూరి, వెంకటరమణ మాట్లాడుతూ టిడిపి సీనియర్ మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, టిడిపి గ్రామ నాయకుడు శ్రీరామ్ రెడ్డి, సహకారంతో గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు విద్యా కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయం అని కొనియాడారు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దడం రాష్ట్ర విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులకు దక్కిందని కొనియాడారు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేసి ఉపాధ్యాయులతో విద్యార్థులకు మంచి విద్యాబోధన ప్రభుత్వ అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం అందించే విధంగా కృషి చేస్తారని చెప్పారు, విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు కోసం పాటుపడే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని విద్యా కమిటీ చైర్మన్ గా నాపై నమ్మకం ఉంచి విద్యా కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించిన శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు మీడియా ద్వార ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు వీరి వెంట వడ్ల రామాపురం గ్రామ టిడిపి నాయకులు మల్లికార్జున, లింగస్వామి, అల్లి భాష, మాజీ ఉపసర్పంచ్, ఏసన్న, రాంప్రసాద్ రెడ్డి గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి చుక్కా భవిష్యత్తుకు బాట

**-జల సంరక్షణపై కోదాడలో విద్యార్థుల అవగాహన ర్యాలీ**
**-నీటి పొదుపు, పునర్వినియోగానికి పిలుపు**







అక్టోబర్ 1 వార్త సాక్ష్యం : జల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు నీటి వృథాను అరికట్టాలనే సందేశంతో కోదాడ పట్టణంలో గురువారం పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల యంగ్ ఎర్త్ లీడర్స్ శివ, చెంచులక్ష్మి, నాగేందర్, కుమార్, అభిరాం, నేహా, వీర కుమారి,శ్యామ్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి ఎస్ఎస్ సలీం షరీఫ్ ఆదేశానుసారంభారీ పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'జల సంరక్షణ మన భవిష్యత్తు రక్షణ', ట్యాప్ కట్టేద్దాం.. నీటిని వృథా చేయవద్దు.. నీటిని మళ్లీ వాడదాం' వంటి నినాదాలతో విద్యార్థులు పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి చుక్క నీటిని పొదుపుగా వినియోగించాలని, అవసరానికి మించి నీటిని వృథా చేయకూడదని సూచించారు.వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని విద్యార్థులు సూచించారు. ఇళ్లలో, పాఠశాలల్లో నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు సాధ్యమైన చోట నీటిని పునర్వినియోగించుకోవాలని వివరించారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను సంరక్షించుకోవచ్చని తెలిపారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేయాలంటే ప్రస్తుత తరమే బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జల సంరక్షణ, ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకం, జీవ వైవిధ్య పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు YELP కార్యక్రమాల ద్వారా చర్యలు చేపడుతున్నట్లు సీనియర్ ఉపాధ్యాయులు, మెంటర్ టీచర్ బడుగుల సైదులు తెలిపారు. విద్యార్థుల చేతుల్లో అవగాహన నినాదాలు, ప్లకార్డులు దర్శనమివ్వగా.. ర్యాలీ ఆద్యంతం పర్యావరణ పరిరక్షణ సందేశాలతో కోదాడ పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో... కోఆర్డినేటర్స్ బడుగుల సైదులు,వి శ్రీనివాసరావు, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులుడి. మార్కండేయ, ఉపాధ్యాయులు డి లింగయ్య,ఎం వీర బ్రహ్మాచారి, ఎస్ కె కాజా మియా, మనోహర్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## స్టాక్ మార్కెట్లో భారీ పతనం.. 9 లక్షల కోట్లు ఆవిరి!




భారత స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో కూరుకుపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల పెద్ద ఎత్తున అమ్మకాలకు పాల్పడటంతో సూచీలు కుప్పకూలాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,000 పాయింట్లకు పైగా పతనమై, ఇటీవలి కాలంలో అత్యంత కనిష్ఠ స్థాయి అయిన 71,528 వద్దకు చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 250 పాయింట్లకు పైగా నష్టపోయి 22,300 స్థాయికి దిగజారింది. ఈ విక్రయాల ధాటికి కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.9లక్షల కోట్లు ఆవిరైంది. ఈ భారీ పతనానికి ప్రధాన కారణం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) భారీగా అమ్మకాలకు తెగబడటమే. నిన్న (సెప్టెంబర్ 30) ఒక్కరోజే రూ. 10,000 కోట్లకు పైగా విలువైన భారత ఈక్విటీలను విక్రయించిన ఎఫ్ఐఐలు, గత రెండు సెషన్లలో కలిపి రూ.20,000 కోట్లకు పైగా ఉపసంహరించు కున్నారు. దీనికి తోడు, అమెరికా 10 ఏళ్ల ట్రెజరీ బాండ్ ఈల్డ్ 5.3 శాతానికి పెరగడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 96 దాటడం కూడా మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలపై నెలకొన్న అనిశ్చితి, మార్కెట్‌లో పెరుగుతున్న ఒడుదొడుకులు ఈ నష్టాలకు మరింత ఆజ్యం పోశాయి. ఈ అమ్మకాల ఒత్తిడిలో ఆటో, సిమెంట్, మెటల్స్ వంటి రంగాల షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. అయితే, ఐటీతో పాటు కొన్ని ప్రైవేట్ బ్యాంకుల షేర్లు కొంతవరకు నిలదొక్కుకున్నాయి. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) కొనుగోళ్లకు మొగ్గుచూపడం మార్కెట్లకు కొంత ఊరటనిచ్చింది.

# ఏప్రిల్ 1 నుంచి కేఫ్-3 నిబంధనలు

ప్యాసింజర్ వాహనాల (పీవీ) తయారీదారులకు ఇంధన సామర్థ్యం, కర్బన ఉద్గారాలకు సంబంధించి మరింత కఠిన లక్ష్యాలను నిర్దేశించేందుకు మూడో దశ కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎకానమీ (కేఫ్-3) నిబంధనలను కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారికంగా విడుదల చేసింది. 2027 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్న కేఫ్-3 నియమావళి ఆపై ఐదేళ్ల పాటు (2032 మార్చి 31 వరకు) వర్తించనుంది. ఆ ఐదేళ్లలో ప్యాసింజర్ వాహనాల ఇంధన వినియోగాన్ని దాదాపు 17 శాతం తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాహన తయారీదారులు ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎలక్ట్రిక్, హైబ్రిడ్, ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలను ప్రోత్సహించడంతోపాటు ఇంధన ఆదా సాంకేతికతలను వినియోగించుకునేందుకు మరింత వెసులుబాటు కల్పించింది. కాగా, వాహన తయారీ పరిశ్రమ కొత్త నిబంధనలను స్వాగతించింది. ఈ ఐదేళ్ల ప్రణాళిక, మార్కెట్ ఆధారిత నిబంధనలు నమ్మకాన్ని పెంచడంతో పాటు తయారీదారులు పలు సాంకేతికతలను వినియోగించుకునేందుకు అనుమతించనుందని పరిశ్రమ అభిప్రాయపడింది. కేఫ్-3 నియమావళి ఇంధన వినియోగ ప్రమాణాన్ని క్రమంగా మెరుగుపర్చనుంది. 2027-28 ఆర్థిక సంవత్సరంలో ఇంధన వినియోగ ప్రమాణాన్ని 100 కిలోమీటర్లకు 3.996 లీటర్లుగా నిర్ణయించింది. 2031-32 నాటికల్లా ఈ వినియోగాన్ని 3.3273 లీటర్లకు తగ్గించాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. అంటే, ఐదేళ్లలో ఇంధన వినియోగాన్ని 16.7 శాతం తగ్గించాల్సి ఉంటుంది. ఈ ప్రకారంగా కిలోమీటరుకు కర్బన ఉద్గారాన్ని 2027-28లో 94.8 గ్రాముల నుంచి 20231-32లో 78.9 గ్రాములకు తగ్గించాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు భారత్‌లో తయారు చేసే లేదా దిగుమతి చేసుకుని విక్రయించే అన్ని పీవీలకు (ఎలక్ట్రిక్, హైబ్రిడ్ మోడళ్లు సహా) వర్తిస్తాయి. వాహన కంపెనీలు తమ పీవీ మోడళ్ల పోర్ట్‌ఫోలియో నిర్దేశిత సగటు ఇంధన వినియోగ లక్ష్యాన్ని చేరుకునేందుకు అధిక ఇంధనం వినియోగించే స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎసయూవీ)లను అధిక మైలేజీ ఇచ్చే పెట్రోల్ కార్లు, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ మోడళ్లలో సమతుల్యం చేసుకోవాల్సి ఉంటుంది.



కొత్త నియమాళిలో భాగంగా పీవీ తయారీదారులు తమ వాహన మోడళ్ల కర్బన ఉద్గారాలు, ఇంధన వినియోగ వివరాలను యేటేటా కేంద్రానికి సమర్పించాల్సి ఉంటుంది. కొత్త నియమావళిలో వాహన ప్రమాణ భారాన్ని 1,082 కేజీల నుంచి 1,229 కేజీలకు పెంచింది ప్రభుత్వం. గతంతో పోలిస్తే 13.6 శాతం అధికం ఇది. అంటే, తక్కువ బరువుండే వాహనాలకు లక్ష్యాల్లో కొంత వెసులుబాటు లభించనుండగా.. అధిక బరువుండే వాహనాలు కఠిన ఇంధన వినియోగ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. కంపెనీకి చెందిన అన్ని వాహన మోడళ్ల ఇంధన సామర్థ్యం సగటు లెక్కింపులో ఎలక్ట్రిక్, హైబ్రిడ్ మోడళ్లకు అదనపు వెయిటేజీ లభించనుంది. ముఖ్యంగా బ్యాటరీ ఎలక్ట్రిక్ కార్లకు 3 రెట్లు, ప్లగ్ ఇన్ హైబ్రిడ్స్, ఇథనాల్ వంటి ఫ్లెక్స్ ఫ్యూయల్‌తో నడిచే స్ట్రాంగ్ హైబ్రిడ్ మోడళ్లకు 2.5 రెట్లు, స్ట్రాంగ్ హైబ్రిడ్స్‌కు 1.6 రెట్లు, ఫ్లెక్స్ ఫ్యూయల్స్‌కు 1.1 రెట్ల వెయిటేజీ లభించనుంది. 1000 యూనిట్ల కంటే తక్కువ విక్రయాలు కలిగిన తయారీదారులను ఈ నిబంధన నుంచి మినహాయించారు. కేఫ్ 3 నియమావళిలో గుర్తింపు కలిగిన ఇంధన ఆదా సాంకేతికతల జాబితాను 4 నుంచి 12కు విస్తరించారు. వాహనంలో ఈ టెక్నాలజీలను పొందుపరిచినందుకు గాను కంపెనీలకు కర్బన ఉద్గారాల నుంచి ఊరట కోరే వీలుంటుంది. ఒక్కో టెక్నాలజీకి గాను కిలోమీటరుకు ఒక గ్రాము కార్బన్ డై ఆక్సైడ్ (ఉదజని) తగ్గింపును, గరిష్ఠంగా కిలోమీటరుకు 9గ్రాముల తగ్గింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. కేఫ్3 నిబంధనలు కార్బన్ న్యూట్రాలిటీ ఫ్యాక్టర్ ద్వారా ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలకు కర్బన ఉద్గారాల నిబంధనల నుంచి కొంత ఊరట కోరే అవకాశం కల్పించింది. 20 శాతం లేదా అంతకంటే అధికంగా ఇథనాల్ కలిపిన ఇంధనంతో నడిచే వాహనాలకు 8శాతం, ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇథనాల్ వెహికిల్స్‌కు 22.3శాతం, సీఎన్‌జీ వాహనాలకు 5 శాతం లేదా బయోగ్యాస్ మిలిత శాతానికి సమానమైన రాయితీ లభించనుంది.

# భారత్ తరఫున ఆడటం వేరే ఫీలింగ్!

ఆసియా క్రీడల్లో భారత్ తరఫున ఆడటం.. అందులోనూ పతకం కోసం పోరాడటం చాలా ప్రత్యేకమైన అనుభూతినిస్తుందని వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అన్నాడు. సాధారణ అంతర్జాతీయ మ్యాచ్‌లతో పోలిస్తే ఆసియా క్రీడల్లో కొంత ఎక్కువ ఒత్తిడి ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో ఇషాన్ కిషన్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 80 పరుగులతో రాణించి భారత్ 169 పరుగులు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం భారత బౌలర్లు శ్రీలంకను కేవలం 45 పరుగులకే ఆలౌట్ చేయడంతో భారత్ ఘన విజయం సాధించింది. "భారత్ కోసం ఆడుతున్నప్పుడు.. ముఖ్యంగా పతకం కోసం ఆడుతున్నప్పుడు మనసులో ఏదో ప్రత్యేకమైన భావన ఉంటుంది. ఇక్కడ బీసీసీఐ కోసం కాదు.. మొత్తం దేశం కోసం ఆడుతున్నామనే ఫీలింగ్ వస్తుంది. చుట్టూ భారత జెండాలు కనిపించడం, అభిమానులు పెద్ద సంఖ్యలో మద్దతు ఇవ్వడం ఆ అనుభూతిని మరింత పెంచుతుంది. బయటకు చూపించకపోయినా లోపల మాత్రం కొంత ఎక్కువ ఒత్తిడి ఉంటుంది" అని ఇషాన్ చెప్పాడు. పగుళు కనిపించే పిచ్‌పై బ్యాటింగ్ చేయడం అంత సులభం కాదని ఇషాన్ తెలిపాడు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం 150 పరుగులు చేస్తే సురక్షితంగా ఉంటామని ముందే అంచనా వేసినట్లు చెప్పాడు. ఒక బ్యాటర్ క్రీజులో కుదురుకుంటే చివరి వరకు ఉండి భారీ స్కోరు చేయాలన్నది జట్టు ప్రణాళికగా ఉందని వివరించాడు. "ఇలాంటి పిచ్‌లపై వ్యక్తిగత లక్ష్యాల కంటే జట్టు అవసరాలే ముఖ్యం. పరిస్థితిని గమనిస్తూ చిన్న చిన్న విషయాలపై దృష్టి పెట్టాలి" అని పేర్కొన్నాడు. ఇక శనివారం పాకిస్థాన్‌తో జరగనున్న స్వర్ణ పతక పోరుపై కూడా ఇషాన్ స్పందించాడు. మ్యాచ్ గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రశాంతంగా




ఉండాలని, ఆ క్షణాలను ఆస్వాదిస్తూ ఆడాలని జట్టు భావిస్తోందన్నాడు. జపాన్‌లో లభించిన ఆతిథ్యంపై ఇషాన్ ప్రశంసలు కురిపించాడు. భాష సమస్య ఉన్నప్పటికీ స్థానికులు ఎంతో సహాయం చేశారని చెప్పాడు. భారత అభిమానులు ఎక్కడికి వెళ్లినా మద్దతుగా నిలుస్తున్నారన్నారు. గెలిచినా ఓడినా తమకు అండగా ఉంటున్న అభిమానులకు ఎప్పటికీ కృతజ్ఞతలు చెబుతామని అన్నాడు.

## వన్డే క్రికెట్‌లో కొత్త చరిత్ర.. ప్రపంచ రికార్డు బద్దలుకొట్టిన టీమిండియా!

శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా వన్డే క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. వెస్టిండీస్‌తో గువాహటి వేదికగా నిన్న జరిగిన రెండో వన్డేలో 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి అద్భుత విజయాన్ని అందుకుంది. వన్డే ఫార్మాట్‌లో భారత్‌కు ఇదే అతిపెద్ద విజయవంతమైన ఛేజింగ్ కావడం విశేషం. ఈ భారీ ఛేదనలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ముందుండి నడిపించాడు. కేవలం 133 బంతుల్లోనే అజేయంగా 223 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. గిల్ వీరోచిత ఇన్నింగ్స్‌తో టీమిండియా 43.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తి చేసింది.

### భారత్ మరో ప్రపంచ రికార్డు

ఈ మ్యాచ్‌లో భారత్ మరో ప్రపంచ రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. వన్డేల్లో అత్యంత వేగంగా 300 పరుగుల మార్కును అందుకున్న జట్టుగా నిలిచింది. కేవలం 175 బంతుల్లోనే (30ఓవర్లలోపు) టీమిండియా ఈ ఘనతను సాధించింది. ఇంతకుముందు ఈ రికార్డు దక్షిణాఫ్రికా పేరిట ఉండేది. 2006లో జోహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియాపై ఆ జట్టు 194 బంతుల్లో 300 పరుగులు చేసింది. తాజాగా ఆ రికార్డును భారత జట్టు బద్దలుకొట్టింది.




# స్పోర్ట్స్

## పాక్‌ను చిత్తు చేసిన భారత్



ఆసియా క్రీడలు 2026లో భారత హాకీ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. మహిళల విభాగంలో నిన్న దక్షిణ కొరియాపై గెలిచి భారత్ ఫైనల్‌కు చేరుకోగా.. తాజాగా భారత పురుషుల జట్టు కూడా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై విజయం సాధించి తుదిపోరుకు సిద్ధమైంది. ఉత్కంఠంగా సాగిన సెమీస్‌లో భారత్ 4-3 తేడాతో పాక్‌ను చిత్తు చేసి.. బంగారు పతకం గెలవాలని పట్టుదలతో ఉంది. తొలి అర్ధ భాగంలో భారత్ హాకీ జట్టు 3-1తో ఆధిపత్యం ప్రదర్శించింది. అయితే, రెండో అర్ధ భాగంలో పాకిస్థాన్ జట్టు అనూహ్యంగా పుంజుకొని స్కోర్లను సమం చేసింది. ఆఖరి నిమిషంలో అభిషేక్ అద్భుతమైన గోల్‌తో భారత్‌ను ఫైనల్‌కు చేర్చాడు. ఈ మ్యాచ్‌లో భారత క్రీడాకారులు హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్.. సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్ చెరో గోల్ చేశారు. గత పదేళ్ల వ్యవధిలో పాక్‌పై భారత్ ఇప్పటి వరకు వరుసగా 21 మ్యాచ్‌లు గెలిచింది. మరోవైపు ఇప్పటి వరకు ఆసియా క్రీడల్లో ఒకే ఎడిషన్‌లో పురుషుల, మహిళల హాకీ జట్లు బంగారు పతకాలను గెలవలేదు. ఈసారి ఆ అవకాశం మన ఆటగాళ్లకు వచ్చింది. మలేసియా, కొరియా మ్యాచ్ విజేతతో శనివారం భారత పురుషుల జట్టు ఫైనల్‌లో తలపడనుంది. ఇక మహిళా జట్టు శుక్రవారం(అక్టోబర్ 02) చైనాతో స్వర్ణం కోసం పోటీపడనుంది. ఆసియా క్రీడలు 2026లో ప్రస్తుతం భారత్ 62 పతకాలతో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇందులో 10 స్వర్ణాలు, 21 రజతాలు, 31 కాంస్యాలు ఉన్నాయి.

## ఇళయరాజాకు ఎదురుదెబ్బ



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాల నాటి 'ఎన్ ఇనియ పొన్ నిలవే' పాట కాపీరైట్ హక్కుల వివాదంలో ఆయన దాఖలు చేసిన అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జస్టిస్ జె.బి. పర్ధివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. 1980 నాటి తమిళ చిత్రం 'మూడు పానీ'లోని ఈ పాట ట్యూన్‌కు (సంగీతానికి) మాత్రమే ఇళయరాజాకు హక్కులు ఉంటాయని... పాట సాహిత్యం, సౌండ్ రికార్డింగ్‌పై ఆయనకు ఎలాంటి హక్కులు ఉండవని కోర్టు తేల్చిచెప్పింది. సినిమా నిర్మాత నుంచి సౌండ్ రికార్డింగ్ హక్కులను పొందిన మ్యూజిక్ లేబుల్ 'సరిగమ'కు అనుకూలంగా ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 'అగతియా' అనే మరో సినిమాలో ఈ పాటను రీక్రియేట్ చేయడంతో ఈ వివాదం మొదలైంది. తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఈ కేసులో సరిగమ సంస్థకు పూర్తిస్థాయిలో న్యాయపరమైన ఉపశమనం లభించినట్లయింది.

# టేలర్ స్విఫ్ట్ పాటల్లో దాగున్న రహస్యం..

## 1.23 లక్షల పదాల విశ్లేషణలో ఆసక్తికర విషయాలు!

టేలర్ పాటల్లో 1,23,553 పదాలను పరిశీలించిన అధ్యయనం
మొత్తం 247 పాటలతో ప్రత్యేక డేటాబేస్ రూపకల్పన
ఆమె పాటల్లో బూడిద రంగు ప్రస్తావన ఎక్కువ
జరగని సంఘటనలు, అవకాశాల పై తరచూ పాటలు
శరీర భాగాలు, దుస్తుల ప్రస్తావనకు ప్రత్యేక స్థానం



పాటలు మారినా.. ఆల్బమ్‌లు కొత్తగా వచ్చినా.. టేలర్ స్విఫ్ట్ రాసే పాటల్లో కొన్ని అంశాలు మాత్రం ఎప్పటికీ మారడం లేదట! ఆమె పాటల్లోని 1.23 లక్షల పదాలను విశ్లేషించిన ఓ అధ్యయనం ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. రంగుల ప్రస్తావన నుంచి మనుషుల ఆలోచనల వరకు.. ఆమె పాటల్లో పదేపదే కనిపించే అంశాలను పరిశోధకులు గుర్తించారు.

### 247 పాటలు.. లక్షకు పైగా పదాలు

అమెరికన్ పాప్ స్టార్ టేలర్ స్విఫ్ట్ పాటల్లో దాగున్న భాషా రహస్యాలను తెలుసుకునేందుకు లివర్‌పూల్ విశ్వవిద్యాలయానికి చెందిన సాహిత్య భాషాశాస్త్ర పరిశోధకురాలు నవోమి ఆడమ్ ఓ ప్రత్యేక డేటాబేస్ రూపొందించారు. టేలర్ లిరిక్ కార్పస్ (టాలికో)గా పిలిచే ఈ డేటాబేస్‌లో 1,23,553 పదాలు ఉన్నాయి. మొత్తం 247 పాటలను ఇందులో చేర్చారు. ఆమె 12 స్టూడియో ఆల్బమ్‌లతో పాటు ఇతర పాటల సాహిత్యాన్ని కూడా పరిశీలించారు.

### బూడిద రంగుకే ఎక్కువ ప్రాధాన్యం

టేలర్ పాటల్లో రంగుల ప్రస్తావన ఆసక్తికరంగా ఉందని ఈ అధ్యయనం వెల్లడించింది. రెడ్ పేరుతో ప్రత్యేక ఆల్బమ్ ఉన్నప్పటికీ.. ఆమె పాటల్లో ఊహించిన దానికంటే ఎక్కువగా కనిపించే రంగు బూడిదేనట. పాత పాటల్లోని నీలి ఆకాశం, ముదురు బూడిద రంగు ప్రస్తావనలతో పాటు కొత్త పాటల్లోనూ ఈ ధోరణి కొనసాగుతోందని పరిశోధకురాలు గుర్తించారు.

### జరగని విషయాలపైనా ఊహలు

టేలర్ పాటల్లో 'ఏమై ఉంటే?' అనే తరహా ఆలోచనలు తరచూ కనిపిస్తుంటాయి. 'వుడ్', 'షుడ్', 'కుడ్' వంటి పదాల వినియోగం ద్వారా జరగని సంఘటనలు, భవిష్యత్తులో జరిగే అవకాశాలపై ఆమె తన పాటల్లో స్పందిస్తుంటారని అధ్యయనం పేర్కొంది. ఇతరులు తనను ఎలా చూస్తారనే కోణం కూడా ఆమె రచనల్లో కనిపిస్తుందని తెలిపింది.

### దుస్తులు.. శరీర భాగాల ప్రస్తావన

చేతులు, ముఖం, గుండె, పెదవులు, భుజాలు వంటి శరీర భాగాల ప్రస్తావన టేలర్ పాటల్లో పదేపదే వస్తోంది. దుస్తుల విషయంలోనూ కార్డిగాన్లు, టీషర్టులు, నల్లటి దుస్తుల వంటి వాటికి ఆమె ప్రాధాన్యమిచ్చారు. ఇవి కేవలం వర్ణనలకే పరిమితం కాకుండా.. పాత్రల వ్యక్తిత్వం, భావోద్వేగాలను ప్రతిబింబిస్తున్నాయని ఆడమ్ విశ్లేషించారు.

### కొత్త పాటల్లోనూ అదే ధోరణి

ది లైఫ్ ఆఫ్ ఎ షోగర్ల్: ది ఎన్‌కోర్ ఎక్స్ టెండెడ్ ఎడిషన్‌లోని నాలుగు కొత్త పాటల్లోనూ గత రచనల్లో కనిపించిన అంశాలు కొనసాగుతున్నాయని అధ్యయనం తెలిపింది. 2026 సెప్టెంబర్ 25న విడుదలైన ఈ ఎడిషన్‌లో పేషెంట్ జీరో సహా నాలుగు పాటలు ఉన్నాయి. టేలర్ తన సంగీత శైలిని మార్చుకుంటున్నా.. పాటల్లోని కొన్ని ఆలోచనలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయని ఈ పరిశోధన స్పష్టం చేస్తోంది.

# వెంకీ 'ఆదర్శ కుటుంబం'..

## ట్రైలర్, బుకింగ్స్ పై కీలక ప్రకటన!



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌పై ఉన్న ఆసక్తిని మరింత పెంచుతూ చిత్రబృందం వరుస అప్‌డేట్స్ తో ముందు కొస్తోంది. సినిమా విడుదల తేదీ అక్టోబర్ 9 సమీపిస్తుండటంతో ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తాజాగా నిర్మాత నాగవంశీ ఈ సినిమా ట్రైలర్ విడుదల, టికెట్ బుకింగ్స్‌కు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు. నాగవంశీ తెలిపిన వివరాల ప్రకారం.. 'ఆదర్శ కుటుంబం' థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 6వ తేదీన విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ తో సినిమాపై అంచనాలు పెరగ్గా, ట్రైలర్‌తో కథాంశం, పాత్రల తీరుతెన్నుల పై పూర్తి స్పష్టత రానుంది. ముఖ్యంగా తొలిసారి వెంకటేశ్‌ను త్రివిక్రమ్ ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ట్రైలర్ విడుదలైన మరుసటి రోజే, అంటే అక్టోబర్ 7 నుంచి తెలుగు రాష్ట్రాల్లో టికెట్ బుకింగ్స్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో అభిమానులు, ప్రేక్షకులు సినిమా విడుదలకు రెండు రోజుల ముందే తమ టికెట్లను రిజర్వ్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా నాగవంశీ మాట్లాడుతూ.. 'ఆదర్శ కుటుంబం'ఒక సంపూర్ణ కుటుంబ కథా చిత్రమని, కామెడీ, యాక్షన్, భావోద్వేగాల కలబోతగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. "పిల్లల పరీక్షలు పూర్తయ్యాక, కుటుంబమంతా కలిసి థియేటర్‌కు వచ్చి హాయిగా నవ్వుకునే సినిమా ఇది. ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని ఆస్వాదిస్తారు" అని ఆయన పేర్కొన్నారు. త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, ఆయన శైలి మేకింగ్‌కు వెంకటేశ్ ఎనర్జీ, టైమింగ్ తోడైతే వినోదం ఏ స్థాయిలో ఉంటుందోనని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నివేదా పేతురాజ్,నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేశ్, సత్య, యువినా పార్థవి వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 9న థియేటర్లలోకి రానున్న ఈ సినిమా పై తాజా అప్‌డేట్స్‌తో అంచనాలు మరింతగా పెరిగాయి.

# 'నువ్వు అద్భుతమైన నటుడివి'..

## ఫహాద్ ఫాజిల్ నటనకు మహేశ్ బాబు ఫిదా





టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు మలయాళ స్టార్ ఫహాద్ ఫాజిల్‌ను ప్రశంసల్లో ముంచెత్తారు. దర్శకుడు శశాంక్ ఏలేటి తెరకెక్కించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమాను చూసిన మహేశ్.. ఫహాద్ అద్భుతమైన నటుడంటూ కొనియాడారు. సినిమా తనకు ఎంతో అందమైన అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. సినిమాను చూసిన అనంతరం మహేశ్ బాబు బుధవారం తన 'ఎక్స్' ఖాతాలో సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' ఎంతో చక్కగా రూపొందిన సినిమా అని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో వినోదాన్ని అందిస్తూనే మనసును హత్తుకునేలా ఉందని అన్నారు. సినిమా మొత్తం ఒక ప్రత్యేకమైన ఆప్యాయత కనిపిస్తుందని ప్రశంసించారు. సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించిన ఫహాద్ ఫాజిల్, బాలనటి సారాను మహేశ్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఫహాద్ నటుడిగా ఎప్పటికప్పుడు కొత్తగా ప్రయోగాలు చేస్తూ తనను తాను మార్చుకుంటూ ముందుకు సాగడం స్ఫూర్తి దాయకమని అన్నారు. ఫహాద్, చిన్నారి సారా కలిసి అద్భుతంగా నటించారని మహేశ్ ప్రశంసించారు. సినిమాలో వారి పాత్రలు జీవిస్తున్నట్లు, ప్రతి క్షణాన్ని అనుభవిస్తున్నట్లు కనిపించిందని పేర్కొన్నారు.

### కార్తికేయ, శశాంక్‌కు అభినందనలు

సినిమా నిర్మాత ఎస్.ఎస్.కార్తికేయను కూడా మహేశ్‌బాబు అభినందించారు. ఆయనకు ఇంత కంటే ప్రత్యేకమైన ఆరంభం ఉండదని పేర్కొన్నారు. కార్తికేయ, శోబు కలిసి ఎంతో ప్రత్యేకమైన సినిమాను రూపొందించారని అన్నారు. దర్శకుడు శశాంక్ ఏలేటి పనితీరును కూడా మహేశ్ ప్రశంసించారు. ఒక అందమైన ప్రపంచాన్ని తెరపైకి తీసుకొచ్చిన విధానం అభినందనీయమని అన్నారు. సినిమా మొత్తం టీమ్‌కు ప్రేమ, శుభాకాంక్షలు తెలిపారు.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.